క్లుప్తంగా

నేడు కిషోర్ నామినేషన్

అర్వపల్లి : తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్ కుమార్ గురువారం అర్వపల్లిలోని యోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తుంగతుర్తిలో నామినేషన్ దాఖలు చేయనున్నారని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ బుధవారం తెలిపారు. పూజా కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి


వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

చివ్వెంల : మోదిన్‌పురంలో ప్రజల అభిప్రాయం లేకుండా బొడ్రాయి పండుగ నిర్వహించకూడదని కోరుతూ బుధవారం చైతన్య యువజన ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కొంత మంది పెద్దలు తమ స్వలాభం కోసమే బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. వేడుకలను ప్రజాభిప్రాయం ప్రకారం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన మండల సభ్యులు భాష్పంగు సునీల్, శ్రీకాంత్, కోలికపంగు వాసు పాల్గొన్నారు.

నామా ప్రవీణ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి, తదితరులు

భానుపురి : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు నామా ప్రవీణ్‌కు పలువురు నాయకులు బుధవారం సూర్యాపేటలో నివాళులర్పించారు. నామా ప్రవీణ్ చిత్రపటానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడు రాజీనామా


చివ్వెంల : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుద్దెటి మధుసూదన్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని బి.చందుపట్లకు చెందిన ఆయన రెండు సంవత్సరాలుగా బీఎస్పీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా గత కొంత కాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు భూమయ్యగౌడ్‌కు పంపనున్నట్లు తెలిపారు. త్వరలో ఏ పార్టీలో చేరేది చెబుతానని పేర్కొన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్లేష్



మద్దిరాల: ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కూజ ఎల్లేష్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడారు. తన ఎంపికకు సహకరించిన ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌కు, జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్‌కు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నకు, మండల అధ్యక్షుడు అవిలమల్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరిక


బీజేపీలో చేరుతున్న నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని కొత్తతండా గ్రామ పంచాయతీ ఆవాసం పాత తండాకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి తెలిపారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగానాయక్, మాదంనాయక్, శ్రీను, మోహన్, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

తుంగతుర్తి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగే అండర్–14 ఖోఖో క్రీడలకు మండల పరిధిలోని అన్నారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల సూర్యాపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వి.మౌనిక, యూ.సింధు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికవడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం


నామినేషన్ పత్రాలను సూర్యాపేట ఆర్వోకు అందిస్తున్న వరికుప్పల వెంకన్న


నామినేషన్ వేస్తున్న బండారు నాగరాజు


తుంగతుర్తిలో నామినేషన్ వేస్తున్న జోహార్


నామినేషన్ దాఖలు చేస్తున్న అనంతయ్య


నామినేషన్ వేస్తున్న కొంగరి మల్లయ్య

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల పర్వం కొనసాగింది. సూర్యాపేట ఆర్వో పరిధిలో బుధవారం ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బహుజన సమాజ్ పార్టీ నుంచి వట్టె జానయ్య, కార్మిక యువ చైతన్య సమితి నుంచి బండారు నాగరాజు, మా ర్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తరఫున వరికుప్పల వెంకన్నలు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కె.వీరబ్రహ్మచారికి అందించారు. అలాగే ధర్మసమాజ్ పార్టీ తరఫున చెరుకు కిరణ్ కుమార్, మచ్చ వీర కుమారిలు మంగళవారం నామినేషన్ దాఖలు చేయగా.. బుధవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలను అందించారు. ఇక ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఆరూరి వెంకటేశ్వర్లు మొదటి సెట్‌ను, మారం వెంకట్ రెడ్డి రెండోసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

తిరుమలగిరి : తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఆర్వో కార్యాలయంలో మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. యువ తులసి పార్టీ అభ్యర్థి బి.అనంతయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థులు కొమ్ము జోహార్, కొంగరి మల్లయ్యలు నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భానుపురి : బీఎస్పీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళ్తూ వట్టె జానయ్యయాదవ్ బుధవారం పెద్దమ్మ తల్లి దేవాలయం, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. ఈ సమయంలో తెలంగాణ తల్లి, అంబేద్కర్, మహాత్మ గాంధీ, కల్నల్ సంతోష్‌బాబు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో ప్రతిపక్షాలకు కాలం చెల్లింది


ఖాసీంపేటలో ప్రచారం చేస్తున్న సునీత


పెన్‌పహాడ్‌లో ప్రచారం చేస్తున్న పాస్టర్లు

చివ్వెంల : రాష్ట్రంలో ప్రతిపక్షాలకు కాలం చెల్లిందని మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. బుధవారం ఖాసీంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను దోపిడి దొంగల పాలు చేయవద్దన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేసి మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచారం

పెన్‌పహాడ్ : మంత్రి జగదీష్‌రెడ్డిని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్, నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొక్క ఏలియా రాజు, మండల అధ్యక్షుడు జాన్ ప్రకాష్, దేవదానం, మీసాల ఏసురత్నం, రూబెన్, రాయిలి శేఖర్, మామిడి కిష్టాపాల్ పాల్గొన్నారు.

కేంద్రాల్లో తడిసిన ధాన్యం పరిశీలన

అర్వపల్లి : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కొమ్మాల గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అకాల వర్షానికి కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేయాలని రైతులకు సూచించారు. ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందున ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ ఎం.రామస్వామి, సిబ్బంది ఆడెపు శ్రీకాంత్, ఎస్.శ్రీనివాస్, రైతులు గంగదెరి శ్రీనివాస్, సైదులు, ప్రవీణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పత్తెపురం సుమలత, సుధాకర్ దంపతులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్‌లు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గుగులోతు భాస్కర్, నాయకులు కందుకూరి విశ్వేశ్వర్, రాజేష్, వహీద్, ఉపేందర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో పలువురు నాయకులు బుధవారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా యోగానందచారి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రైతు బంధు సమితి కోఆర్డినేటర్ మామిడి సత్యనారాయణ, తాటిపాముల జలంధర్, కుంభం యాగయ్య, మత్స్య సంఘం చైర్మన్ మామిడి విజయ్, మాజీ ఎంపీటీసీ దేవరకొండ సోమనర్సమ్మ, బట్టమేకల రాంమల్లు, డాక్టర్ జేరుపోతుల లక్ష్మణ్‌గౌడ్, సైదుల కిరణ్, బండారి నారాయణ, మామిడి రాజు, కుంభం చంద్రశేఖర్, రాంబాబుతో పాటు 200 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, మండల యూత్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, దాసరి సోమయ్య, నర్సింగ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నర్సింగ నాగమ్మ, గుడిపల్లి సోమిరెడ్డి, ఎల్లంల కొమిరెల్లి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..

అభివృద్ధిని చూసి మళ్లీ ఆశీర్వదించండి


ప్రచారంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్


యడవెల్లిలో ఎమ్మెల్యే కిషోర్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు

నూతనకల్ : తుంగతుర్తి నియోజకవర్గంలో పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రజలు తనను మళ్లీ ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం, యడవెల్లి, చిల్పకుంట్ల, వెంకెపల్లి, బక్కహేమ్లాతండా, సోమ్లాతండా, టీక్యాతండా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత రెండు పర్యాయాలుగా సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. సాగునీరు, మంచినీటి సమస్యను పరిష్కరించామని అన్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు మొదలగు పథకాలను కొసాగించడంతో పాటు రైతుబీమా సదుపాయం కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. నియోజకవర్గానికి ఏనాడూ మొఖం చూపించని ప్రతిపక్ష పార్టీల నాయకులకు నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం నూతనకల్ మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన సుమారు 20మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్యయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, చూడి లింగారెడ్డి, గాజుల తిర్మల్‌రావు, కొంపెల్లి రాంరెడ్డి, పులుసు లింగమల్లయ్య, బత్తుల సాయిలుగౌడ్, కొచ్చెర్ల బాబు, గుగులోతు శంకర్ నాయక్, సురేందర్‌నాయక్, నర్సింహ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసిచూపుతా


మక్తాకొత్తగూడెంలో మాట్లాడుతున్న సంకినేని

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మిద్దనపల్లి, బొప్పారం, ఏపూరు, రామన్నగూడెం గ్రామాల్లో చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరన్నారు. పరీక్షలు నిర్వహించకుండానే ప్రశ్నపత్రాలను లీకేజీ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, గృహలక్ష్మి, దళితబంధు, గిరిజన బంధు లాంటి పథకాలను ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అమలు చేశారని తెలిపారు. పథకాలను బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి సంద్యాల సైదులు, మండల ప్రధాన కార్యదర్శులు పాటీ కరుణాకర్ రెడ్డి, మోరగుండ్ల గంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ అస్లాం పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి : సూర్యాపేట నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గెలుపు ఖాయమని సంకినేని లక్ష్మి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావుకు ఓటు వేయాలని కోరుతూ బుధవారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు అధ్యక్షుడు వాంకుడోత్ ప్రమీల శ్రీనివాస్, కౌన్సిలర్లు పలస మహాలక్ష్మి, సలిగంటి సరిత, జిల్లా నాయకురాలు పోలోజు మౌనిక, మణెమ్మ, బొల్లం నాగమణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తప్పవు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

దురాజ్‌పల్లి : ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, ప్రకటనలను ట్రాకింగ్ ద్వారా కట్టడికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు దినపత్రికలు, వివిధ చానల్స్‌లలో వచ్చే వార్తలు, ఆర్టికల్స్‌ను నిరంతరం పరిశీలన చేసి సస్పెక్ట్, పెయిడ్ న్యూస్, ఆర్టికల్స్‌పై ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలకు తదుపరి చర్యలపై పంపించాలన్నారు. అలాగే వ్యయ పరిశీలకులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో డీపీఆర్‌ఓ రమేష్ కుమార్, డీఈ మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

సోదరిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

- ఆస్తి కోసమే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాహుల్ హెగ్డే


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : ఆస్తి కోసం సోదరిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసు వివరాలు వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలం అనాజిపురం గ్రామానికి చెందిన అనుములపురి రాజ్‌కుమార్ సూర్యాపేటలోని సీతారాంపురానికి చెందిన సోదరి స్వరూపరాణి వద్ద తన తండ్రి పేరిట సూర్యాపేటలో గల 300 గజాల భూమిని తాకట్టుపెట్టి రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. రాజ్‌కుమార్ 6 నెలల నుంచి డబ్బులు చెల్లిస్తాను, ప్లాట్ కాగితాలు ఇవ్వాలని కోరితే స్వరూపారాణి నిరాకరించింది. అది నాన్న సంపాదించిన ఆస్తి అందులో తనకూ సమాన వాటా ఉందని తేల్చిచెప్పింది. నీకు ఇచ్చిన డబ్బులకు వడ్డీ లెక్క కడితే నీ వాటా ప్లాట్‌కి సరిపోయాయి చెప్పడంతో రాజ్‌కుమార్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు.

ఇనుప బద్దెతో దాడి చేసి..

సోదరి వైఖరికి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన రాజ్‌కుమార్ ఆమెను హత్య చేసి బంగారం అపహరించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 5న సాయంత్రం సమయంలో సూర్యాపేటలో తన సోదరి స్వరూపరాణి ఇంటికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్నది చూసి ఇనుప బద్దెతో ఆమె తలపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడు తీసుకొని అక్కడ ఉన్న దుస్తులకు నిప్పంటించి మొహం మీద వేసి, షార్ట్‌సర్క్యూట్ జరిగినట్లు చిత్రీకరించి అక్కడి నుంచి పారిపోయాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేందర్‌నాథ్, హెడ్‌కానిస్టేబుల్ కరుణాకర్, కృష్ణ, సైదులు, కానిస్టేబుల్ ఆనంద్, సైదులు, మధులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు, డీఎస్పీ పరిక నాగభూషణం, సీఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న మొరిశెట్టి ఉపేందర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బింగి ఉప్పలయ్యతో పాటు మరికొంతమంది బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, బి.వెంకన్న, పెద్ది శ్రీనివాస్, లొడంగి నాగరాజు, కుంభం నాగరాజు, సురేష్, సందీప్, మహేష్, నగేష్, నరేష్, సైదులు, రాజశేఖర్, రాజు, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

తిరుమలగిరి : తిరుమలగిరిలోని శ్రీనివాస జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

అర్వపల్లి : ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను పెంపకందారులు జీవాలకు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. వేల్పుచెర్ల గ్రామంలో బుధవారం 400 గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సులు

కోదాడఅర్బన్ : కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం పంచారామాలు, దక్కన్ పంచశైవ క్షేత్రాల దర్శనానికి కోదాడ డిపో నుంచి బస్సులను నడపనున్నట్లు కోదాడ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష బుధవారం తెలిపారు. శబరి మలై యాత్రకు బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

నూతనకల్ : ఎర్రపహాడ్ గ్రామ గౌడ సంఘం కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శీలం నారాయణ, ఉపాధ్యక్షుడిగా అనంతుల వెంకన్న, కార్యదర్శిగా గుండగాని మల్లయ్యతో పాటు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు లింగాల రామచంద్రు, జలగం యోగానందం, లింగాల రాములు, అనంతుల నాగలింగం, లింగాల సత్తెయ్య, జలగం సీతారాములు, ఏకస్వామి పాల్గొన్నారు.


గౌడ సంఘం నూతన కార్యవర్గం

విశ్వరూప సభ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు


ఆత్మకూరులో..

తిరుమలగిరి : ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంహెచ్‌పీ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు కందుకూరి సోమయ్య కోరారు. బుధవారం మామిడాల గ్రామంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీను, ప్రశాంత్, దామోదర్, ఎల్లయ్య, స్వామి, వెంకటయ్య, కృష్ణ, విష్ణు, సుకన్య, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఆత్మకూర్ (ఎస్) : హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా కోఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ, రాష్ట్ర నాయకుడు కనుకుట్ల వెంకన్న మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట విశ్వరూప మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు పొట్టపెంజర రాంబాబు మాదిగ, అధికార ప్రతినిధి మిరియాల చిన్ని, పిడమర్తి రాములు, ఆరెంపుల విష్ణు, పిడమర్తి శ్రీను, బొల్లెపాక మహేష్, బొడ్డు ప్రభాస్, తిప్పర్తి అరుణ్ తేజ్, జినక మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని వర్షం.. దెబ్బతింటున్న పంటలు


అనాజిపురంలో నేలకొరిగిన వరి పొలాలు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం శివారులో..

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. అనాజిపురం, అనంతారం, లింగాల, పొట్లపహాడ్ తదితర గ్రామాల్లో చేతికొచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పొలాలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జాజిరెడ్డిగూడెం పరిధిలోని గ్రామాల్లో..

అర్వపల్లి : అకాల వర్షాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. మండలంలో మంగళవారం రాత్రి కూడా వర్షం పడింది. ఇప్పటికే మూడు సార్లు అకాల వర్షాలు పడి ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. కోయని వరిపొలాలు నేలకొరిగాయి.

బాలికల ఆరోగ్యానికి మంచి ఆహారమే ప్రధానం


సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

కోదాడఅర్బన్ : బాలికల ఆరోగ్య పరిరక్షణకు మంచి ఆహారమే ప్రధానమని ప్రకృతి వనం ప్రసాద్ అన్నారు. బుధవారం బాలాజీనగర్‌లో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆహారం, ఆరోగ్యంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే హిమోగ్లోబిన్ సమృద్ధిగా పెరుగుతుందన్నారు. వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఎక్కువగా పల్లీలు, బెల్లం, రాగిజావా, శనగలు, జొన్నలు తీసుకోవాలని, నీరు అధికంగా తాగాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

తిరుమలగిరి : తిరుమలగిరిలో మూర్ఛ వ్యాధితో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నోముల గ్రామానికి చెందిన ఎస్‌కే. షబ్బీర్ (38) గత కొద్ది రోజులుగా తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో కాగితాలు, సీసాలు ఏరుకొని అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అతడు వ్యవసాయ మార్కెట్‌లోకి వెళ్లి పంపు వద్ద నీళ్లు తాగుతుండగా మూర్ఛ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసు కున్నారు. అనంతరం తుంగతుర్తి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు.